క్లుప్తంగా

ఎనిమిది పాఠశాలల్లో ప్రశాంతంగా నాస్ పరీక్ష

సత్తెనపల్లి: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యలను అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే జాతీయ సాధన సర్వే (నాస్) పరీక్ష బుధవారం పట్టణం, మండలంలోని ఎంపిక చేసిన 8 పాఠశాలల్లో నిర్వహించారు. ఎంఈఓ–2 ఎ.రాఘవేంద్రరావు పట్టణంలోని యూనిక్ పాఠశాల, కేంద్రీయ విద్యాలయంలో జరుగుతున్న నాస్ పరీక్షలను పరిశీలించారు. 3,6,9 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, సైన్సు, సాంఘిక శాస్త్రం, గణితం పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలతో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 228 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువు సామర్థ్యం తెలుసుకునేందుకు నాస్ పరీక్ష దోహద పడుతుందన్నారు. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి ఈ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

నకరికల్లు: రబీ సీజన్‌లో సాగుచేయనున్న అన్ని రకాల పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని నర్సింగపాడు, త్రిపురాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో బావులు, బోర్ల ద్వారా సాగుచేస్తున్న వరిపంటను ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన పథకానికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. వరి పంట బీమాను ఎకరాకు రూ.42వేలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎకరాకు రూ.630 చొప్పున ప్రీమియంను డిసెంబర్ 31వ తేదీలోగా చెల్లించాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎం.డి.జాన్ అహ్మద్, వీఆర్వో జె.మాలాలి, గ్రామ కార్యదర్శి కె.అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల: మొక్కజొన్న, శనగ పంటలు వేసే రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్త వహించాలని మండల వ్యవసాయ అధికారి యం.అరుణ తెలిపారు. మండలంలోని చాగంటివారిపాలెం, లంకెలకూరపాడు గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. వ్యవసాయ సహాయకులు పి.శైలజ, ఎంఎస్‌కేఎం సుభాని, రైతులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: మొక్కజొన్న సాగు చేపట్టే రైతులకు ప్రస్తుతం సాగు సమయం అనుకూలమని మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య తెలిపారు. బుధవారం మండలంలోని పాపాయపాలెం గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన సహాయకుడు ఎం.వంశీ, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు



క్రోసూరు: ప్రతి కూలీకి తప్పనిసరిగా పని కల్పించాలని ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఎంపీడీఓ మండల ప్రాజెక్ట్ అధికారిగా బాధ్యతలు తీసుకున్నందున ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పని చేయటానికి డిమాండ్ అప్లికేషన్ ఇచ్చిన ప్రతి వ్యక్తికి పని కల్పించాలని ఆదేశించారు. తాను ఆకస్మిక తనిఖీలు చేసి మస్టర్ తనిఖీ చేస్తానన్నారు. కనీసం వేతనం వచ్చేవిధంగా కొలతలు ప్రకారం పని చేయించాలన్నారు. హౌసింగ్ ఏఈ వెంకట్రావు, ఏపీఓ వెంకట్రావు, టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు గొర్రెల దొంగల అరెస్టు

సత్తెనపల్లి: ఇరువురు గొర్రెల దొంగలను సత్తెనపల్లి రూరల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం గ్రామ పొలాల్లో మూడు గొర్రెలను మంగళవారం దొంగతనం చేసి ఆటో వద్దకు తీసుకు వెళుతున్న సమయంలో గొర్రెల యజమాని శ్రీకాంత్, మరికొందరు గమనించారు. సత్తెనపల్లికి చెందిన అన్నపురెడ్డి రవి, ఒంటిపులి మహేష్‌లు దొంగతనం చేశారని, వారిరువురిని తీసుకొచ్చి సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఇరువురి పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ అమినుద్దీన్ బుధవారం తెలిపారు. మరొకరు పరారీలో ఉన్నాడన్నారు.

మండలంలో ఎంఎస్ఎంఈ సర్వే

నకరికల్లు: మండలంలో చేపడుతున్న ఎంఎస్ఎంఈ సర్వేతో చిరు, చిన్న, మధ్యతరహా వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం యోచిస్తుందని ఎంపీడీఓ జి.కాశయ్య అన్నారు. మండలంలోని నకరికల్లు, చల్లగుండ్ల గ్రామాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాల సర్వేను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం సిబ్బందిచే ఎంఎస్ఎంఈ సర్వే చేపట్టి వ్యాపారులను స్థితిగతులను ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.వి.శివప్రసాద్, అబ్దుల్లా, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది వి.ఎస్.ప్రసాద్, షేక్.కరిముల్లా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రహదారికి రాజకీయ గ్రహణం!

- వైఎస్సార్ సీపీ హయాంలో అమరావతి–బెల్లంకొండ అడ్డరోడ్డు డబుల్‌రోడ్డుకు శంకుస్థాపన
- రూ.149 కోట్లతో 40 కి.మీ రోడ్డు పనులకు శ్రీకారం
- నేడు రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోని కూటమి సర్కారు
- గ్రావెల్ వేశారు.. నిర్మాణం మరిచారు
- దుమ్ముధూళితో అవస్థలు పడుతున్న ప్రజలు, వ్యాపారులు

అటకెక్కిన డబుల్ రోడ్డు నిర్మాణం



దుమ్ము ధూళితో అధ్వానంగా రహదారి



వర్షం సమయంలో రోడ్డు దుస్థితి..

క్రోసూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రతిష్టాత్మక రోడ్డు నిర్మాణానికి నేడు గ్రహణం ఏర్పడింది. ఎన్నో గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా ఉండే రోడ్డు నిర్మాణాన్ని నేడు కూటమి నేతలు, అధికారులు గాలికొదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే... వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పెదకూరపాడు నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు 40కి.మీ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. రహదారి ఆవశ్యకతను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించడంతో రూ.149కోట్లు నిధులు మంజూరు చేశారు. అంతేకాకుండా గతేడాది జూన్12వ తేదీన మాజీ సీఎం వైఎస్ జగన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పుడు పనులు సైతం శరవేగంగా జరిగాయి. అయితే తదనంతరం ప్రభుత్వం మారడంతో నేడు రహదారి నిర్మాణాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

ఒక్క అడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి..

నేడు రహదారి నిర్మాణం ఒక్క అడుగు ముందుకు, నాలుగడుగులు వెనక్కి అన్నచందంగా నడుస్తోంది. రోడ్డు మొత్తం గ్రావెల్ వేసి ఉండటంతో వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఎగిసి పడి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అమరావతి నుంచి బెల్లంకొండ వరకు సుమారు 17 గ్రామాలుండగా దొడ్లేరు, మునుగోడు, ఊటుకూరు, ఆవులవారిపాలెం, అనంతవరం గ్రామాల్లో సైడు డ్రైన్లు నిర్మించి పూర్తిచేశారు. దొడ్లేరులో సీసీ రోడ్డు, మునుగోడు, ఊటుకూరులో సీసీ రోడ్డు కల్వర్టులు పనులు మాత్రమే జరిగాయి. కానీ రోడ్డు పనులు ముందుకు సాగలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో నిధులు మంజూరై, ప్రారంభించిన రోడ్డు కాబట్టి, ఒక వేళ సకాలంలో పూర్తి చేస్తే వైఎస్సార్ సీపీకి పేరు వస్తుందోననే భయంతోనే కూటమి నేతలు రహదారి నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

దుమ్ముతో తీవ్ర ఇక్కట్లు...

రోడ్డు వెడల్పు చేసి గ్రావెల్ పనులు చేసి వదిలేయటంతో వాహనాల రాకపోకలతో వాటి వెంట ఎగిసి పడుతున్న దుమ్ము, ధూళితో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాక రోడ్డు చాలా చోట్ల గోతుల మయంగా మరింది. రోడ్డు పక్కనే ఉన్న హోటళ్ల, పండ్ల వ్యాపారులు, చిల్లర వ్యాపారులు, హోటళ్ల దుమ్ము లోనే వ్యాపారాలు చేస్తున్నారు. ఒక వాహనం వెళితే దాని వెంటే కొంత దూరం మేర దుమ్ము తీవ్రంగా ఎగిసి పడుతూ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్లన్నీ దుమ్మమయం..



రోడ్డు పై నుంచి వస్తున్న దుమ్ము కారణంగా ఇళ్లన్నీ దుమ్ముతో నిండిపోతుంది. శుభ్రం చేయడానికి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

– షేక్ మహబూబ్ బీ, క్రోసూరు

రోడ్డు త్వరగా పూర్తిచేయాలి..



పొలాల్లో కూలి పనులకు వెళ్తుంటే దుమ్మంతా మాపైన పడుతుంది. దుస్తులపై, ఒంటి పై దుమ్ము పడి చాలా ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి.

– షేక్ మీరాబీ, క్రోసూరు

బిల్లులు ఆలస్యం అవుతున్నాయి..

బిల్లులు రావటం చాలా ఆలస్యమవుతోంది. అందుకని పనులు ఆలస్యమవుతున్నాయి.

– పున్నారావు, ఆర్అండ్‌బీ ఏఈ, క్రోసూరు.

మాజీ సీఎం రోశయ్య సేవలు వెలకట్టలేనివి



సత్తెనపల్లిలో రోశయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

సత్తెనపల్లి: ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, కీర్తిశేషులు డాక్టర్ కొణిజేటి రోశయ్య చేసిన సేవలు వెలకట్టలేనివని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో గల డాక్టర్ కొణిజేటి రోశయ్య విగ్రహం వద్ద బుధవారం రోశయ్య 3వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి రోశయ్య ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు పెరుమాళ్ళ లక్ష్మి శివన్నారాయణ, నాయకులు దూపగుంట్ల జానకి రామారావు, కాపుగంటి రత్తయ్య, కనమర్లపూడి సుబ్బారావు, కొత్తూరి విశ్వేశ్వరరావు, సింగరి మధుసూదనరావు, చిలకల శ్రీనివాసరావు, వనమా శివ నాగేశ్వరరావు, చలువాది హరికుమార్, దేవరశెట్టి రవికుమార్, దేవతి సుబ్బారావు, తొమండ్రు సత్యనారాయణ, వేమా ప్రసాద్, రంగిశెట్టి సుమన్ కుమార్,షేక్ కలి, పాల్గొన్నారు.

– ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఏరియా వైద్యశాల ఎదుట ఆయన విగ్రహానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ పితామహుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మూడో వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం క్రోసూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయనచిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎంపీపీ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు వాసవి లయన్ గుగ్గిలం విజయ శేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ కట్టమూరు అప్పారావు, క్యాబినెట్ ట్రెజరర్ తొమ్మండ్రు నాగేశ్వరావు, అనుమాల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు



వరి పంటను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి, కెనడా విద్యార్థిని జోహన్న విల్కిన్స్

ముప్పాళ్ల: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. మండలంలోని నార్నెపాడులోని ప్రకృతి వ్యవసాయ పంటలను కెనడా పీహెచ్‌డీ విద్యార్థిని జోహన్న విల్కిన్స్, రైతు సాధికారక సంస్థ అధికారి సౌమ్యలు బుధవారం సందర్శించారు. గ్రామానికి చెందిన మెంటార్ రజిని సాగుచేసిన వరి పంటను పరిశీలించారు. వరిలో పిలకలు అధికంగా దుబ్బులు బాగా మట్టిని పట్టి ఉండటాన్ని గమనించారు. వరిపంటలో 30 నుంచి 35 పిలకలు ఉన్నాయని, ఎటువంటి చీడపీడలు లేకుండా ఆరోగ్యరమంగా ఉందని తెలిపారు. అనంతరం నిరంతరం ఆదాయాన్ని ఇచ్చే ఏటీఎం మోడల్స్‌ను పరిశీలించి ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. తరువాత గ్రామంలోని ప్రకృతి వ్యవసాయం చేసే మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఉమ, ఎన్ఎఫ్ఏ నందకుమార్, మాస్టర్ ట్రైనర్ మధుబాబు, మెంటార్ రజిని, ఇన్‌చార్జ్ పూజ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న అవ్వారు సర్వేశ్వరరావు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్మిస్తున్న పల్నాడు విజ్ఞాన కేంద్ర నిర్మాణానికి సెల్లార్ శ్లాబ్ పూర్తయి బిల్లులు చెల్లించాల్సి ఉండటంతో పట్టణంలోని కొత్తపేటకు చెందిన అవ్వారు సర్వేశ్వరరావు తాను వాగ్దానం చేసిన రూ. లక్షలో భాగంగా తొలి దఫాగా రూ. 70 వేలు బుధవారం ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయకుమార్‌కు అందించారు. ఆయనకు పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ తరపున అభినందనలు తెలిపారు. అలాగే పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ ఏరియాకు చెందిన జి.ఆంజనేయులు పల్నాడు విజ్ఞాన కేంద్ర నిర్మాణ నిమిత్తం తాను వాగ్దానం చేసిన రూ. 50 వేల విరాళంలో చివరి భాగం రూ. 15 వేలు ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయకుమార్‌కు అందించారు.ఆయా కార్యక్రమాలలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు గుంటూరు మల్లేశ్వరి, తదితరులు ఉన్నారు.

జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టిపై దాడి

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి, న్యాయవాది కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావుపై పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బుధవారం రాత్రి దాడి జరిగింది. వెంకట సాంబశివరావు పట్టణంలో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై నాగార్జుననగర్‌లో తన ఇంటికి వెళుతుండగా, వెనుక నుంచి ఇరువురు గుర్తుతెలియని వ్యక్తులు బలమైన కర్రతో తలపై దాడిచేశారు. సాంబశివరావు తేరుకుని వెంబడించగా పరారయ్యారు. దీనిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో తాను అవినీతికి పాల్పడుతున్న వ్యక్తులపై ప్రశ్నించినందునే తనపై దాడిచేశారని సాంబశివరావు అన్నారు.

మందిర నిర్మాణానికి విరాళం

చిలకలూరిపేట: మండలంలోని కావూరు గ్రామంలో నిర్మితమౌతున్న శ్రీషిరిడీ సాయిబాబా మందిరానికి చిన సత్తార్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ పఠాన్ యూసుఫ్‌ఖాన్ రూ. లక్ష విరాళం అందజేశారు. బుధవారం ఆయన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో మందిర నిర్మాణ కమిటీ సభ్యులకు ఈ విరాళం అందించారు. తనకు మాతృ సమానురాలైన డీఆర్ఎస్ఎస్‌వీఎస్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ లైబ్రేరియన్ గింజుపల్లి సుశీలమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళం అందజేసినట్లు తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

అచ్చంపేట: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఈనెల 5 నుంచి 2025, జనవరి 10వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జి.శ్రీనివసయాదవ్ బుధవారం తెలిపారు. 5న మాదిపాడు, 7న గింజుపల్లి, 10న చల్లగరిగ, 12న తాడువాయి, 17న చింతపల్లి, 19న తాళ్లచెరువు, 21న అచ్చంపేట, 24న చిగురుపాడు, 26న కోగంటివారిపాలెం, 28న అంబడిపూడి, 31న ఓర్వకల్లు, జనవరి 2న కోనూరు, 4న కస్తల, 7న వేల్పూరు, 8న పెదపాలెం, 9న మిట్టపాలెం, 10న కొండూరు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని చెప్పారు. రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి వాటిని వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆయన కోరారు.

క్రోసూరులో...

క్రోసూరు: మండలంలో ఈనెల 6 వ తేదీ నుంచి రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసల్దార్ శ్రీనివసయాదవ్ బుధవారం తెలిపారు. ఈ నెల 6 వ తేదీ ఉదయం 88 త్యాళ్లూరు, మధ్యాహ్నం ఉయ్యందన గ్రామాల్లో, 7న అనంతవరం, హసనాబాద్, 10 గుడిపాడు, గాదెవారిపాలెం, 11 నాగవరం, గరికపాడు, 12 అందుకూరు, బాలెమర్రు, 13 విప్పర్ల, ఊటుకూరు, 17 బయ్యవరం, 18 దొడ్లేరు, ఆవులవారిపాలెం(దొడ్లేరు), పెరికపాడు(దొడ్లేరు), 20 క్రోసూరు, 21 ఎర్రబాలెం, 23వ తేదీ పీసపాడు, పారుపల్లి, గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ఆర్యవైశ్య నాయకులకు సత్కారం



సత్తెనపల్లి: నూతనంగా ఎన్నికైన ఆర్య వైశ్య చలివేంద్ర సంఘ అధ్యక్షుడు బచ్చు కొండలు, గో సంరక్షణశాల అధ్యక్షుడు పెండ్యాల కాశీ మల్లేశ్వరరావులను పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన మండపంలో ఆర్యవైశ్య యువజన సంఘ అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు బచ్చు మురళి, జవ్వాజి రవి కుమార్, వనమా రాజేష్, దేసు రాజా, వాసు, లఘువరపు రమేష్, కటకం చంద్ర, భవిరిశెట్టి సాయి, యక్కల సతీష్ ఉన్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ



గాయాలపాలైన న్యాయవాది అనిల్‌కుమార్‌ను పరామర్శిస్తున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. అచ్చంపేట మండలం చిగురుపాడు గ్రామంలో మంగళవారం రాత్రి కొంత మంది వ్యక్తులు న్యాయవాది మెదర అనిల్‌కుమార్ కారును అడ్డగించి దాడి చేశారు. గాయాల పాలైన అనిల్ కుమార్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ క్షతగాత్రుడు అనిల్‌కుమార్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాది అనిల్ కుమార్ పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్ రహీమ్, గుజ్జర్లపూడి మార్క్‌రావు, సందెపోగు బాబురావు, చిన్నం మణిబాబు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, న్యాయవాదుల గుమస్తాల సంఘం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగులూరి సుబ్బారావు, సత్తెనపల్లి అధ్యక్షుడు మర్రి నరసింహారావు, కార్యదర్శి బలిజేపల్లి కోటి రత్నం, తదితరులు చికిత్స పొందుతున్న న్యాయవాది అనిల్‌కుమార్‌ను పరామర్శించారు.

ముందస్తు గుర్తింపుతోనే బోద వ్యాధి నివారణ



పాపాయపాలెంలో రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

బెల్లంకొండ: ప్రాథమిక దశలో ముందస్తుగా గుర్తింపుతోనే బోదవ్యాధి నివారణ సాధ్యమవుతుందని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. బోధవ్యాధి నివారణలో భాగంగా వ్యాధి వ్యాప్తిని గుర్తించేందుకు మండలంలో రెండు సబ్ సెంటర్‌లను ఎంపిక చేసి, శాంపిల్స్ సేకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని పాపాయపాలెం గ్రామంలో బుధవారం మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు గ్రామంలో సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు మూడు రోజులపాటు 100 మంది నుంచి రక్త నమూనాలను సేకరించినట్లు తెలిపారు. ఈ శాంపిల్స్‌ను పరీక్షించి బోద వ్యాధికారక క్రిమి రక్తంలో ఎంతశాతం వ్యాధి వ్యాప్తిని చేస్తుందో గుర్తించనున్నట్లు తెలిపారు. తద్వారా వ్యాధి నివారణకు చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 5వ తేదీ నుంచి మూడు రోజులపాటు చంద్రాజుపాలెం గ్రామంలో 300 రక్త శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాషా, ఏఎన్ఎం రాధా, హెల్త్ అసిస్టెంట్ శంకర్ రెడ్డి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలను పెంచుకోవాలి



ఎన్ఏఎస్ పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులలో సామర్థ్యాలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. నరసరావుపేట పరిధిలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, చైతన్య భారతి స్కూల్, హార్డ్ పాఠశాల, రావిపాడులోని సెయింట్ మేరీస్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న నేషనల్ అసెస్మెంట్ సర్వే పరీక్షల నిర్వహణ తీరును బుధవారం డీఈఓ చంద్రకళ పరిశీలించారు. ఆయా కేంద్రాలలో 3వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాల వ్యవధిలో 45 ప్రశ్నలు, 6వతరగతి విద్యార్థులకు 90 నిమిషాల వ్యవధిలో 51 ప్రశ్నలు, 9వతరగతి విద్యా ర్థులకు 120 నిమిషాల వ్యవధిలో 60 ప్రశ్నలతో పరీక్ష నిర్వహించారు. ఆయా కేంద్రాలతో పాటు మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి 8వ తేదీన జరగనున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈసందర్భంగా డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ, ఎన్ఏఎస్ పరీక్ష ద్వారా విద్యార్థులలో సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. అలాగే జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ చేతిరాతను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్య క్రమంలో మున్సిపల్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం ఓ.సాంబయ్య, బాలుర పాఠశాల హెచ్ఎం టి.రవికాంత్ పాల్గొన్నారు.

ట్రైనింగ్ సెంటర్ మంజూరు చేయండి

నరసరావుపేట: జిల్లా కేంద్రంలో రోడ్డుసేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ సెంటర్‌కు అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాదరెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. బుధవారం సచి వాలయంలో మంత్రిని కలిసి విన్నవించారు. తన నియోకవర్గంలో ఒక మహిళా పారిశ్రామిక వేత్తచే 'రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ కోసం రవాణాశాఖలో బిజినెస్ అండ్ ఎస్టాబ్లిష్ మెంట్‌లో భాగంగా అనుమతి కోరకు అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. వెనుకబడిన జిల్లాలో పెట్టుబడి దారులకు అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి ప్రజా వ్యతిరేక విధానాలు

చిలకలూరిపేట: కేంద్రరాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9,10 తేదీలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నాయకులను కోరారు.